క్లుప్తంగా

వసతి గృహ విద్యార్థినులకు పుస్తకాల పంపిణీ



విద్యార్థినులకు గైడ్‌లు అందిస్తున్న బ్యాంకు మేనేజర్ అప్పారావు

రావికమతం: స్థానిక ఎస్సీ బాలికల వసతి గృహంలో పదో తరగతి విద్యార్థినులకు ఆల్ ఇన్ వన్ గైడ్‌లను గ్రామానికి చెందిన సెంట్రల్ బ్యాంకు మేనేజర్ ముక్కా అప్పారావు ఆదివారం పంపిణీ చేశారు. ఆయన మాతృమూర్తి ద్వితీయ వర్ధంతి సందర్భంగా వీటిని అందించారు. ఈ సందర్భంగా వసతి గృహ మేట్రిన్ రమణ, సమరసత సేవా సంస్థ ఆర్గనైజర్ ఫణి కుమార్ మాట్లాడుతూ కనిపించే దైవాలు తల్లిదండ్రులని, వారిని సేవిస్తూ ఉన్నత స్థాయికి చేరుకోవాలన్నారు. అనంతరం అమ్మ గొప్పతనంపై వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులందించారు.

సూరిబాబు ఆశయ సాధనకు కృషి



సూరిబాబు స్తూపం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

గొలుగొండ: ఉమ్మడి విశాఖ జిల్లాలో గిరిజనుల హక్కులు కోసం అనేక ఉద్యమాలు నిర్వహించిన మేకా సూరిబాబు ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ పనిచేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి బాలేపల్లి వెంకటరమణ కోరారు. ఏఎల్‌పురంలో సూరిబాబు 36 వర్ధంతి సందర్భంగా ఆయన స్తూపం వద్ద ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా వెంకటరమణ మాట్లాడుతూ పాడేరు, గొలుగొండ, కొయ్యూరు, జీకేవీధి, చింతపల్లి మండలాల్లో గిరిజనుల సమస్యలు పరిష్కారానికి ఉద్యమాలు నడిపి ఈ రోజు ఈ ప్రాంత వాసుల గుండెల్లో చిరస్థాయిగా నిలిచారని కొనియాడారు. పార్టీ మండల నేతలు, సూరిబాబు అభిమానులు పాల్గొన్నారు.

ఆరుగురికి సీఎం రిలీఫ్ ఫండ్ మంజూరు



బాధిత కుటుంబాలకు చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే గణేష్

నర్సీపట్నం: నియోజకవర్గంలోని పలువురికి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ ఆదివారం స్థానిక క్యాంపు కార్యాలయంలో పంపిణీ చేశారు. ఇటీవల వైద్య చికిత్సల నిమిత్తం ముఖ్యమంత్రి సహాయనిధికి దరఖాస్తులు చేసుకున్న పోతల చానిక్యకు రూ.28 వేలు, లోకారపు రమణమ్మకు రూ.52 వేలు, పోతల రాజుబాబుకు రూ.8 వేలు, షేక్ మదీనాబీకి రూ.70 వేలు, షేక్ నూర్‌బీకి రూ.24 వేలు, షేక్ రహమతుల్లాకు రూ.46 వేల చొప్పున మొత్తం రూ.2.28 లక్షలు మంజూరైంది. ఈ మొత్తాన్ని చెక్కుల రూపంలో బాధిత కుటుంబాలకు అందజేశారు. ఈ మేరకు ఎమ్మెల్యేకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేసారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

సాగరంలో వికసిత్ భారత సంకల్ప యాత్ర



కేంద్ర పథకాలు వివరిస్తున్న ఇన్‌చార్జి ఎంపీడీవో మీనాకుమారి తదితరులు

మాడుగుల: సాగరం సచివాలయం వద్ద ఆదివారం సాయంత్రం వికసిత్ భారత సంకల్ప యాత్ర కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఇన్‌చార్జి ఎంపీడీవో మీనాకుమారి కేంద్ర ప్రభుత్వ పథకాలు గురించి వివరించారు. ఆయుష్మాన్ కార్డులు పంపిణీ చేశారు. సర్పంచ్ కోట్ని జయమ్మ, ఎంపీటీసీ శ్రీనాథు సూర్యకాంతం, ఉప సర్పంచ్ దొడ్డి లక్ష్మీనారాయణరావు, కార్యదర్శి డి. ప్రసాద్ పాల్గొన్నారు.





ఎంపీడీవో కార్యాలయం



సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న మహిళలు(ఫైల్)

మహిళోదయం

- చిరు వ్యాపారాలతో స్వయం సమృద్ధి
- అండగా నిలుస్తున్న వైఎస్సార్ చేయూత
- మూడు విడతలుగా నగదు లబ్ధి

వైఎస్సార్ చేయూత ద్వారా మూడు విడతలుగా మంజూరైన నిధులు

సంవత్సరం	లబ్ధిదారులు	జమ అయిన సొమ్ము
2020 -	3,495	రూ.6,55,31250 కోట్లు
2021 -	3,635	రూ.6,81,56,250 కోట్లు
2022 -	3,706	రూ.6,94,87,500 కోట్లు

చీడికాడ: మహిళలు స్వయం సమృద్ధి సాధిస్తే ఆ కుటుంబాలు మరింత ఆర్థికంగా ఎదుగుతాయి. ఇందుకు ప్రభుత్వ సహాయం తోడైతే సమాజం ఎంతో అభివృద్ధి చెందుతోంది. ఈ నేపథ్యంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆలోచన నుంచి కార్యరూపం దాల్చిన వైఎస్సార్ చేయూత పథకం ఎంతో మంది మహిళల ఆర్థిక కష్టాలను గట్టెక్కించడమే కాకుండా వారి ఉపాధి కల్పనకు దోహదపడింది. నిరుపేద, మధ్య తరగతి కుటుంబాల్లో భర్త సంపాదనతోపాటు వేడినీళ్లకు చన్నీళ్ల తోడు అన్నట్టుగా చిరువ్యాపారాలు చేసుకుంటూ ఆర్థిక స్థితి మెరుగుపరుచుకుంటున్నారు.

స్త్రీనిధి రుణాలు అదనం

వైఎస్సార్ చేయూత అందుకునే మహిళలకు వివిధ మార్గాల్లో ఆర్థికంగా నిలదొక్కుకునేందుకుగాను ప్రత్యేకంగా స్త్రీనిధి ద్వారా తక్కువ వడ్డీకి రూ.50 వేల నుంచి లక్ష రూపాయల వరకు రుణాలు అందిస్తూ సహకారం అందిస్తున్నారు.

ఈ చిత్రంలోని ఆమె పేరు దువ్వ కాసులమ్మ. చీడికాడ మండలం కోనాం గ్రామానికి చెందిన ఆమెది పేద కుటుంబం. భర్త కూలి పనులు చేస్తుంటాడు. గతంలో ఏ చిన్న కష్టమొచ్చినా ఇరుగుపొరుగు వారి వద్దకు అప్పు కోసం వెళ్లేది. నేడా పరిస్థితి లేదు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత నాకు వైఎస్సార్ చేయూత ద్వారా మొదటి సంవత్సరం అందిన రూ.18,750తోపాటు పెట్టుబడి కోసం మరో రూ.50 వేలు స్త్రీనిధి రుణం తీసుకుంది. ఈ మొత్తంతో కోనాం సంతలో కిరాణా దుకాణం అద్దెకు పెట్టుకుంది. ప్రస్తుతం తన కిరాణా వ్యాపారం బాగుంది. తాను తీసుకున్న రుణం తీర్చేసింది. అప్పులను తీర్చుకుని నేడు గౌరవంగా బతుకుతోంది. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రుణం తీర్చుకోలేనిదని ఆనందంగా చెబుతోంది.





ఈ చిత్రంలోని ఆమె పేరు తిలపాక నాగమణి. చీడికాడ మండలం శిరిజాం గ్రామానికి చెందిన ఆమె కుటుంబం ఆర్థికంగా చితికిపోయింది. ఒకరి సంపాదనతో ఇంటిల్లిపాది బతకాల్సి వచ్చేది. ఈ నేపథ్యంలో ఏం చేద్దామన్నా ఏదోఒక ఆర్థిక ఇబ్బంది నెలయ్యేసరికి చుట్టిముట్టేది. సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత తన లాంటి కుటుంబాలు ఎదుగుదలకు ప్రవేశపెట్టిన వైఎస్సార్ చేయూత, ఆసరా పథకాలు ఆదుకున్నాయి. వీటితో వచ్చిన డబ్బులతో చిన్నపాటి ఫాన్సీ దుకాణం తెరిచింది. దుకాణం అభివృద్ధి కోసం స్త్రీనిధి ద్వారా తక్కువ వడ్డీకి మరో లక్ష రూపాయలు తీసుకుంది. ప్రస్తుతం ఆమె కుటుంబం ఆర్థికంగా నిలదొక్కుకునేలా పథకాలందించిన సీఎం జగన్‌కు రుణపడి ఉంటానంది.

ఈ చిత్రంలోని ఆమె పేరు కశిరెడ్డి భవాని. చీడికాడ మండలం అర్జునగిరి గ్రామం. ఈమె ఇప్పటి వరకు వైఎస్సార్ చేయూత ద్వారా రూ.56,250 వేలు అందుకుంది. ఈ సొమ్ముతో రెండు గేదెలను కొనుగోలు చేసింది. ప్రతి నెలా వాటి ద్వారా రూ.3 వేల ఆదాయం వస్తోంది. నాలుగు మాసాల క్రితం చెరువులో దిగిన పశువులను ఒడ్డుకు తోలేందుకు ఆమె భర్త అందులో దిగి మునిగిపోయి మృతి చెందాడు. దాంతో వైఎస్సార్ బీమాకు దరఖాస్తు చేసుకోగా రెండు నెలల్లోనే తన ఖాతాకు రూ.5 లక్షలు బీమా సొమ్ము జమ అయింది. దీనికి తోడు వితంతు పింఛన్ అందుతోంది. రైతు భరోసా వస్తోంది. ఏటా డ్వాక్రా రుణమాఫీ (ఆసరా) ద్వారా రూ.16 వేలు అందుతోంది. ఈ మొత్తం సొమ్ముతో ఆమె హాయిగా బతుకుతోంది. ప్రస్తుతం ఒక గేదెను మేపుతోంది. ఇలాంటి పథకాల ద్వారా తనలాంటి వారిని ఆదుకుంటున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటానని ఆనందంగా చెబుతోంది.



అంబేడ్కర్‌కు ఘన నివాళి



అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే గణేష్, పార్టీ నాయకులు



అంబేడ్కర్‌కు నివాళులర్పిస్తున్న దృశ్యం

నర్సీపట్నం: భారత రాజ్యాంగ ఆమోద దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక పార్టీ కార్యాలయంలో డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ చిత్రపటానికి ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్, పార్టీ నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. ప్రపంచ దేశాలకు భారత రాజ్యాంగం ఆదర్శంగా నిలుస్తుందని కొనియాడారు.

గొలుగొండ: రాజ్యాంగం పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఎస్సీ సెల్ విభాగం జిల్లా అధ్యక్షురాలు, సర్పంచ్ లోచల సుజాత తెలిపారు. ఏఎల్‌పురంలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలతో ఆమె ఘన నివాళులర్పించారు. రేముల నాగేశ్వరరావు, ధర్వేజ్, నరసయ్య, సత్తిబాబు, ప్రకాష్ పాల్గొన్నారు.

నాతవరం: రాజ్యాంగ నిర్మాణ కర్త డాక్టరు బీఆర్ అంబేడ్కర్ ఆశయాలకు అనుగుణంగా మనమంతా నడుచుకోవాలని గిరిమిత్ర స్వచ్ఛంద సేవా సంస్థ కార్యదర్శి బండి గంగరాజు అన్నారు. సరుగుడు పంచాయతీ శివారు రామన్నపాలెం ఆశ్రమ పాఠశాలలో ఆదివారం విద్యార్థులతో కలిసి అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. నాతవరం గ్రంథాలయంలో మాజీ ఎంపీపీ నేతల విజయ్‌కుమార్, గ్రంథపాలకుడు ఆర్. కన్నబాబు అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్వీపర్ బంగారమ్మను ఘనంగా సత్కరించారు. ఉపాధ్యాయులు కె. ప్రభుదాస్, గోపాలకృష్ణ వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ మండల నాయకుడు బోసి పరదేశి పాల్గొన్నారు.



రామన్నపాలెం గిరిజన ఆశ్రమ పాఠశాలలో..

నమూనా పరీక్షకు విశేష స్పందన



నమూనా పరీక్షకు హాజరైన విద్యార్థులు

నర్సీపట్నం: స్పందించే హృదయం చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పట్టణంలోని జెడ్పీ హైస్కూల్(మెయిన్)లో నిర్వహించిన జాతీయ ప్రతిభ ఉపకార వేతన నమూనా పరీక్షకు విశేష స్పందన లభించింది. నర్సీపట్నం పరిసర పాఠశాలల నుంచి 120 విద్యార్థులు హాజరయ్యారు. ఈ పరీక్షలను ఎం.బి.బి.పట్నం జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం అప్పారావు, పెదబొడ్డేపల్లి ఉపాధ్యాయుడు అల్లు అప్పారావు పర్యవేక్షించారు. నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్(ఎన్‌ఎంఎంఎస్) పరీక్షల్లో ఉత్తీర్ణులైన ఎనిమిదో తరగతి విద్యార్థులకు నాలుగేళ్లపాటు ఏటా కేంద్ర ప్రభుత్వం రూ.12 వేల స్కాలర్‌షిప్ ఇస్తుందన్నారు. దీనిపై అవగాహనకు నమూనా పరీక్ష నిర్వహించి, ప్రతిభ కనబరిచిన ముగ్గురు విద్యార్థులకు ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలు అందజేశారు.

రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలు

నాతవరం: రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందించిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందని సర్పంచ్ మిరపల వెంకటరమణ, ఎంపీటీసీ తమరాన సత్యనారాయణ తెలిపారు. ఆదివారం పెదగొలుగొండపేటలో ఉజ్వల పథకం కింద 61 మందికి గ్యాస్ కనెక్షన్లు మంజూరయ్యాయి. ఈ సందర్భంగా ఒక్కొక్క లబ్ధిదారుకు రూ.500లకే గ్యాస్ స్టౌలు అందించారు. ఈ సందర్భంగా సర్పంచ్, ఎంపీటీసీ మాట్లాడుతూ గత టీడీపీ హయాంలో జన్మభూమి కమిటీ అభీష్టం మేరకు సంక్షేమ పథకాలు అందేవని విమర్శించారు. ఇప్పుడా పరిస్థితి లేదన్నారు. అర్హతే ప్రామాణికం అన్నారు. నియోజకవర్గంలో సచివాలయం భవనాన్ని మొదటిగా తమ గ్రామంలోనే ఎమ్మెల్యే గణేష్ ప్రారంభించారన్నారు. ఇక్కడ జగనన్న లేవుట్లలో ముందుగా అధిక శాతం లబ్ధిదారులు ఇళ్లు కట్టుకున్నారని, వాటిని స్వయంగా కలెక్టరు రవి పట్టాన్‌శెట్టి పరిశీలించారన్నారు. సచివాలయ పరిధిలో అధికంగా నిధులు ఎమ్మెల్యే మంజూరు చేయడంతో తక్కువ వ్యవధిలో అభివృద్ధి సాధించామన్నారు. జల్ జీవన్ మిషన్ నుంచి కోటి రూపాయలతో ఇంటింటికీ కుళాయిల ఏర్పాటు పనులు వేగవంతంగా చేస్తున్నామన్నారు. ఈ పనులు పూర్తయితే ప్రజలకు శాశ్వతంగా తాగునీటి సమస్య తీరుతుందన్నారు. విద్యుత్ లోవోల్టేజీ సమస్య పరిష్కారం చేసామన్నారు. అనంతరం సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. పీకేగూడెం పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి ఉలబాల గంగునాయుడు, వార్డు సభ్యులు, పంచాయతీ కార్యదర్శి శ్రీను పాల్గొన్నారు.



సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్ర పటానికి క్షీరాభిషేకం చేస్తున్న సర్పంచ్, ఎంపీటీసీ

హైకోర్టు న్యాయమూర్తిని కలిసిన బార్ అధ్యక్షుడు

చోడవరం రూరల్: రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి అనుపమను చోడవరం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కాండ్రేగుల డేవిడ్ మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఆదివారం విశాఖపట్నంలోని ఓ సమావేశానికి విచ్చేసిన న్యాయమూర్తిని ఆయన కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం అక్కడ సమావేశంలో బార్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.



హైకోర్టు న్యాయమూర్తికి పుష్పగుచ్ఛం అందిస్తున్న బార్ అధ్యక్షుడు డేవిడ్

ఘనంగా క్రీస్తురాజు పండగ

రోలుగుంట: స్థానిక ఆర్సీఎం చర్చిలో ఆదివారం క్రీస్తురాజు పండగను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కె.నాయుడుపాలెం, కొవ్వూరు, కొత్తకోట, బోగాపురం తదితర గ్రామాల నుంచి రోమన్ కేథలిక్ మతస్తులు ఉదయం నుంచి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. భీమినిపట్నానికి చెందిన రెవ ఫాదర్ పరంజ్యోతి, పెదబొడ్డేపల్లికి చెందిన బాలాజీ ఫాదర్, కొత్తకోటకు చెందిన అజయ్ ఫాదర్ పాల్గొని విశ్వాసులకు సువార్త చదివి వినిపించారు. దీనిలో భాగంగా బాలేసు, సైతాన్ తదితరుల చిన్నారుల వేషధారణ ఆకట్టుకుంది.



ప్రార్థన చేస్తున్న ఫాదర్లు

ఎన్‌సీసీతో క్రమశిక్షణ, సేవాభావం

అనకాపల్లి రూరల్: అనకాపల్లి ఏఎంఏఎల్ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ గెల్లా జయబాబు ఆధ్వర్యంలో ఆదివారం ఎన్‌సీసీ దినోత్సవ కార్యక్రమాలు జరిగాయి. ఎన్‌సీసీ వలంటీర్లు స్వచ్ఛ శారదా కార్యక్రమంలో భాగంగా శారదానదీ పరీవాహక ప్రాంతంలో శ్రమదానం చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఎన్‌సీసీతో క్రమశిక్షణ, సేవాభావం అలవడుతుందన్నారు. ఎన్‌సీసీ కేడెట్లకు క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, రన్నింగ్ పోటీలు నిర్వహించి, గెలుపొందిన వారికి బహుమతులు అందించారు. కళాశాల కరస్పాండెంట్ దాడి శ్రీనివాసరావు, ఎన్‌సీసీ అధికారులు, కేడెట్లు పాల్గొన్నారు.

జాబ్ మేళా రేపు

అనకాపల్లిటౌన్: స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ రహదారి సాయి కుల్యంత్ డిగ్రీ కళాశాల ఆవరణలో ఈ నెల 28న ఉదయం 10 గంటలకు జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ కామరాజు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. టెన్త్, ఇంటర్, డిగ్రీ, ఐటీఐ, డిప్లమో, బీటెక్ ఉత్తీర్ణులై 20 నుంచి 35 ఏళ్ల వయసున్న వారు అర్హులని పేర్కొన్నారు. 8 కంపెనీలు పాల్గొంటాయన్నారు.

కార్తీకం.. ఆధ్యాత్మిక శోభితం



మాడుగుల: జంపెన గుప్తలింగేశ్వరాలయంలో కార్తీక దీపారాధన పూజలు చేస్తున్న మహిళలు

- శైవ క్షేత్రాలకు పోటెత్తిన భక్తులు
- ఆకట్టుకున్న దీపారాధన

మాకవరపాలెం: కార్తీక పౌర్ణమి సందర్భంగా శైవక్షేత్రాలు భక్తులతో కిటకిటలాడాయి. ఆదివారం ఉదయం నుంచి ఉపవాసాలు ఆచరించి సాయంత్రం శివాలయాలకు చేరుకుని పూజలు చేశారు. ధ్వజ స్తంభాల వద్ద దీపాలు వెలిగించి శివపార్వతులను దర్శించుకున్నారు. పి.పి.అగ్రహారంలోని అమృతేశ్వర, గిడుతూరులోని గంగాధరేశ్వరస్వామి, పెద్ద మిల్లు జంక్షన్‌లో స్వయం భూ వామలింగేశ్వరస్వామి ఆలయాల్లో సాయంత్రం జ్వాలా తోరణం కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు.

మాడుగుల/మాడుగుల రూరల్: జంపెన గుప్తలింగేశ్వర శివాలయంలో ఆదివారం రాత్రి కార్తీక దీపారాధన నిర్వహించారు. ఇక్కడ పెద్దేరులో ఉత్తరాయన స్నానం ఆచరించి శివాలయంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఎం. కోడూరు కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కె.జె.పురం శివాలయంలో సాయంత్రం స్వామివారి తిరువీధి ఉత్సవం, అనంతరం జ్వాలాతోరణం నిర్వహించారు. వి.వి.అగ్రహారం పార్వతీ సమేత భీమేశ్వర ఆలయంలో పౌర్ణమి పూజలు నిర్వహించారు.

కె.కోటపాడు: కార్తీక పౌర్ణమి పర్వదినం సందర్భంగా శివాలయాల్లో భక్తులు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు కేదారీశ్వర నోములను ఆచరించారు. దాలివలసలో పండగ చేశారు. ఈ సందర్భంగా రామాలయంలో సీతారాములకు ప్రత్యేక పూజలు చేశారు.

బుచ్చెయ్యపేట: వడ్డాదిలో భ్రమరాంబిక సహిత మల్లికార్జునస్వామి ఆలయంలో నవగ్రహ, నక్షత్ర ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాత్రికి ఆలయంలో వేలాది మంది భక్తులు కార్తీక దీపాలు వెలిగించడంతోపాటు జోలాతోరణం నిర్వహించారు. బుచ్చెయ్యపేట, రాజాం, దిబ్బిడి, విజయరామరాజుపేట, బంగారుమెట్ట, ఫంగిడి, చిట్టియ్యపాలెం, తురకలపూడి తదితర గ్రామాల శివాలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఉదయం నుంచి రాత్రి వరకు ఉపవాసాలుండి పెద్దేరు, తాచేరు, బొడ్డేరు తదితర పుణ్య నదుల్లో కార్తీక దీపాలు వదిలారు.

వైభవంగా లక్ష దీపారాధనోత్సవం

రోలుగుంట: స్థానిక కాశీవిశ్వేశ్వర మృత్యుంజయ ఆలయం వద్ద లక్ష దీపారాధనోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ నిర్మాణకర్త పిల్లి చిన్నారావు, ప్రచార కార్యదర్శి పిల్లి శ్రీను శివ మాలధారులతో కలసి ప్రదక్షిణలు చేశారు. ఆలయ ముఖ ద్వారం వద్ద జ్వాలాధారణ చేసి అగ్నిదేవుడిని ఆహ్వానించారు. అనంతరం ఆకాశ దీపం వెలిగించి కార్తీక దామోదరుడిన్ని పూజించారు. ముందుగా భక్తులకు నిర్వాహకులు లక్ష ప్రమిదలను, నూనె సమకూర్చారు. ఈ ప్రమిదలను శివుడు, పార్వతీ పరమేశ్వరులు, ఓంకారం, స్వస్తిక్ తదితర ఆకారాలలో వెలిగించి భక్తిశ్రద్ధలతో పూజలు చేసుకున్నారు. ఆలయ ముఖద్వారం నుంచి కొండపై శివాలయం వరకూ అర కిలో మీటరు మేర ఇరు పక్కలా ప్రమిదలు వెలిగించారు. ఎంతో విశిష్టత కలిగిన ఈ ఆలయానికి స్థానికులతోపాటు కొమరవోలు, కె.నాయుడుపాలెం, కొండపాలెం, కొవ్వూరు తదితర గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చి శివుడిని దర్శించుకున్నారు.



కె.కోటపాడు శివాలయంలో భక్తుల పూజలు



మాడుగుల రూరల్: ఎం. కోడూరు కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయంలో..



బుచ్చెయ్యపేట: వడ్డాది శివాలయం వద్ద జ్వాలాతోరణం



రోలుగుంట:శివలింగాకారంలో ప్రమిదలు వెలిగించిన భక్తులు